1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 154
గురువారం 11 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఎమంత్రి చెప్పినా వినరా?.. తెనాలి మున్సిపల్ అధికారులపై నాదెండ్ల ఆగ్రహం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తూర్పు కాల్వకట్ట రోడ్డులో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండ్రోజుల క్రితం ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే వ్యర్థాలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన మంత్రి.. వ్యర్థాలు తొలగించకపోవడాన్ని గమనించి మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను ఘటనాస్థలికి పిలిపించి ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. చెత్త కుప్పలు ఎక్కువగా ఉన్నాయని.. టెండర్ పిలిచి తొలగిస్తామని మున్సిపల్ సిబ్బంది సమాధానం చెప్పారు.మున్సిపాలిటీ జేసీబీ, ట్రాక్టర్లతో చేయాల్సిన పనికి టెండరా? అని మంత్రి అసహనం వ్యక్తం చేశారు.


## ప్రభుత్వ సేవల వినియోగానికి ప్రత్యేక యాప్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)

ప్రభుత్వ సేవలన్నింటినీ మన మిత్ర ద్వారా ఆన్‌లైన్‌లో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని.. అలాగే ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, క్షేత్రస్థాయిలో వివిధ శాఖల పనితీరుపై మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు వినియోగించుకోవడంపై ప్రజల్లో అవగాహన పెంచాలి. అర్బన్ ప్రాంతాల మాదిరే.. గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లలో సేవలు అందాలి. ప్రజలకు అందించే తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ తాగునీటి నమూనాలు తీయాలి. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రకృతి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి. 'జలధార' ఫలితాలు కనిపించాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నిండేలా చూడాలి. ప్రభుత్వ భూములకు సాంకేతికత ఆధారంగా రక్షణ కల్పించాలి. అనంతపురం జిల్లాలో అమలు చేస్తున్న

# ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర..



నెహ్రూ రికార్డు బ్రేక్

సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానిగా మోదీ సరికొత్త రికార్డు

జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించిన మోదీ

12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్డీఏ ప్రత్యేక సమావేశం

ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న కార్యక్రమానికి అగ్రనేతల హాజరు

మోదీకి అభినందనగా తీర్మానం ఆమోదించే అవకాశం


## దిగ్గజ దర్శకుడు భారతీరాజా కన్నుమూత

ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు భారతీరాజా (84) ఇక లేరు

చెన్నైలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ తుదిశ్వాస

గ్రామీణ కథలతో భారతీయ సినిమాలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన దిగ్గజం

కుమారుడి మరణం తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురైన భారతీరాజా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 11)

'సీతాకోకచిలుక', 'ఆరాధన' వంటి తెలుగు చిత్రాలకూ దర్శకత్వం భారతీయ సినిమాలో గ్రామీణ కథలకు జీవం పోసిన దిగ్గజ దర్శకుడు, నటుడు భారతీరాజా (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని తన నివాసంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో తమిళ చిత్ర

## రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేస్తాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)

మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో విశాఖలో సదస్సు నిర్వహణకు సంబంధించి ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పర్యాటక శాఖ ఎండీ పద్మావతి, ఐఏటీవో జాతీయ అధ్యక్షుడు రవి గోసేన్. చిత్రంలో ఐఏటీవో గౌరవ కార్యదర్శి సునీల్ మిశ్ర, మాజీ అధ్యక్షుడు రాజీవ్ మెహ్రా, ఉపాధ్యక్షుడు సంజయ్ రాజ్‌దన్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీవో) సహకారంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్నంలో సెప్టెంబరు 10 నుంచి 12 వరకు 41వ ఐఏటీవో వార్షిక సదస్సు నిర్వహించేందుకు ఆ సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం సాయంత్రం మంత్రి సమక్షంలో ఏపీ టూరిజం ఎండీ పద్మావతి,

## దేశవ్యాప్తంగా బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్

ఈ విధానంతో ఏపీలో పౌరసరఫరాల బియ్యం పకడ్బందీగా సరఫరా

మోదీ మార్గదర్శనం.. చంద్రబాబు విజన్‌తో అమరావతి నిర్మాణం

వారిద్దరూ 'చూద్దాంలే.. చేద్దాంలే' అనే ధోరణితో ఉండరు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)



ఆంధ్రప్రదేశ్‌లో పౌరసరఫరాల బియ్యం పక్కదారి పట్టకుండా బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడంతో పకడ్బందీగా సరఫరా జరుగుతోందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కొనియాడారు. ఈ పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు బాగా పర్యవేక్షించడంతో విజయవంతమైందని, ఈ స్ఫూర్తితోనే దేశవ్యాప్తంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కు చెందిన బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ ముద్రించడాన్ని అమలు చేస్తామని ఆయన ప్రకటించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ప్రహ్లాద్ జోషి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

## నేతల సిఫార్సుల కంటే.. ప్రజల అవసరాలే ముఖ్యం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)

నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల పరంగా బాగున్న నిర్మాణాలను పగలగొట్టొద్దని, వాటిని అలాగే ఉంచి అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా కాలువలు, రోడ్లు వంటివి నిర్మించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కమిషనర్లకు సూచించారు. నాయకులు ఏదేదో చెబుతుంటారని, వాటి కంటే ప్రజలకు అవసరం ఉందా లేదా అనేది గుర్తించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నెల్లూరులో ఓ బాగున్న డ్రెయిన్‌ను పగలగొట్టి కొత్త దానికి తనతోనే అధికారులు ఇటీవల శంకుస్థాపన చేయిస్తే అభ్యంతరం చెప్పానని గుర్తుచేశారు. ఒంగోలులోనూ బాగున్న భవనాన్ని కూల్చేశారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన చోట చిన్న పనులు మొదట చేపట్టి పూర్తి చేయాలని, పెద్ద పనులు కూడా దశల వారీగా పూర్తి చేద్దామని మంత్రి పేర్కొన్నారు. 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'పై రెండు రోజుల రాష్ట్రస్థాయి కార్యశాలను మంగళవారం విజయవాడలో మంత్రి నారాయణ ప్రారంభించారు. సభలో, అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు.'మున్సిపల్ ఆస్తులు ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నట్లు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. పట్టణ స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో ప్రాజెక్టులు చేపట్టాలని సూచించాం. ప్రభుత్వం నిధులు సమకూర్చే పరిస్థితి లేనందున, పీపీపీ విధానంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించాం. దేశంలోని అనేక రాష్ట్రాలు

## స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదు: మంత్రి అనిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)



స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన కార్మికులను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్ ఆస్పత్రికి వచ్చినా ఆయన పార్టీ కార్యకర్తలు ఏవేవో నినాదాలు చేశారని విమర్శించారు. "సీఎం హోదాలో జగన్ ఎప్పుడైనా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లారా? అక్కడి కార్మికుల సమస్యల గురించి మాట్లాడారా? మృతుల కుటుంబాలకు స్టీల్‌ప్లాంట్, కేంద్రం, రాష్ట్రం పరిహారం ఇచ్చాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి కంటే ఎక్కువ పరిహారం అందుతుంది. చనిపోయిన ఒప్పంద కార్మికుల కుటుంబానికి కూడా పరిహారం, ఉద్యోగం ఇస్తున్నాం. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయంగా విమర్శలు సరికాదు"అని మంత్రి అనిత అన్నారు.

## కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

అన్ని వ్యవస్థలను జగన్ నాశనం చేశారన్న కొల్లు రవీంద్ర

రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వెల్లడి

ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 11)



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. గత వైసీపీ ప్రభుత్వంపై

## బెంగళూరు హైకోర్టు జడ్జి మన్మధరావు తండ్రికి నివాళులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 10)

బెంగళూరు హైకోర్టు జడ్జి మన్మధరావు తండ్రి రామ్మూర్తి అకాల మరణం పొందారు. కరేడు గ్రామంలో సొంత భూమి నందు వారి కుల ఆచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు, రామ్మూర్తి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓరా శ్రీనివాసులు, పిగిలి శ్రీనివాసులు, కరేటి చెన్నయ్య, రామ్మూర్తికి నివాళులర్పించారు.

## థిమాటిక్ యోగాను జయప్రదం చేయండి

### జిల్లా కలెక్టర్ విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 10)

ఈ నెల 13వ తేదీన మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే థిమాటిక్ యోగాను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులు, ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. యోగ యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు బలంగా తెలియజేసి వారిని ఆ దిశగా మళ్ళించాలన్నారు. ఈ ప్రత్యేక యోగా కార్యక్రమంలో ముఖ్యంగా రైతులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమ వేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు అక్కడకు వచ్చే వారికి త్రాగునీరు, ఇతర సౌకర్యాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మొత్తం 2500 మంది ప్రజలు కార్యక్రమంలో పాల్గొనే విధంగా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈ నెల 17వ తేదీన త్రిపురాంతకంలో నిర్వహించబోయే టెంపుల్ యోగాను సైతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో ఎం వెంకట శివరామిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ ఇన్చార్జ్ అధికారి బాలాజీ నాయక్, ఉద్యాన శాఖ అధికారి రమేష్, ఐసిడిఎస్ ఇంచార్జ్ పీడీ పద్మావతి, ఇతర ఆయుష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## 13న ఏపీజిఈఏ చీరాల తాలూకా నూతన కమిటీ ఎంపిక

(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 10)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా నూతన కమిటీ ఎంపికకు షెడ్యూలు విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా హాట్-హక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి, జిల్లా కన్వీనర్ పసుమర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా కమిటీ ఎంపికకై ముడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రస్తుత కమిటీ స్థానంలో నూతన కమిటీ ఏర్పాటుకు జూన్ 13న చీరాల మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నందు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా హెల్త్ అసిస్టెంట్ సిహెచ్ దుర్గారావు, కే అంజిబాబు వ్యవహరించనున్నారని తెలియజేసారు. నామినేషన్స్ జూన్ 13 శనివారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు, నామినేషన్ వెరిఫికేషన్ ఉదయం 11 నుండి 12 గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ అనంతరం మధ్యాహ్నం 1 నుండి 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల నందు చీరాల తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొనాలని ఈ సందర్భంగా వారు కోరారు.

### మొదటి పేజీ తరువాయి

## ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 11)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఒక అరుదైన మైలురాయిని అందుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై కేంద్రంలో సుదీర్ఘకాలం పాటు నిరవధికంగా సేవలు అందించిన ప్రధానిగా ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. బుధవారం నాటికి ప్రధానిగా 12 ఏళ్ల (4,399 రోజులు) పదవీకాలాన్ని మోదీ పూర్తి చేసుకున్నారు. 1952లో దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత నెహ్రూ పదవీకాలాన్ని (4,398 రోజులు) ఈ పోలికకు ప్రామాణికంగా తీసుకున్నారు. ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేసినప్పటికీ, ఆమె పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. దీంతో 2014, 2019, 2024లలో వరుసగా మూడుసార్లు చారిత్రక విజయం సాధించి, నిరవధికంగా ప్రధానిగా కొనసాగుతున్న నేతగా మోదీ నిలిచారు. ఈ చారిత్రక ఘనతను, ఎన్డీఏ ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని బుధవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మిత్రపక్షాల నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీకి అభినందనలు తెలుపుతూ ఎన్డీఏ ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం. ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ విధానాలు, రాజకీయ వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మోదీ హయాంలో కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, కర్తవ్య పథ్, వందే భారత్ రైళ్లు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే.

## ప్రభుత్వ సేవల వినియోగానికి ప్రత్యేక యాప్

పైలట్ ప్రాజెక్టును పరిశీలించాలి. గంజాయిని అరికట్టేందుకు మూలాల్లోకి వెళ్లాలి. మహిళలపై నేరాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలి. సుపరిపాలనలో భాగంగా కొత్త విధానాలను ప్రవేశపెట్టాం. ఆర్టీజీఎస్, అవేర్ వంటి వ్యవస్థలతో పరిపాలనలో కొత్త విధానాలు తీసుకురావాలి. ఈ తరహా పద్ధతులు అమలు చేసేందుకు కేంద్రం ఆసక్తిగా ఉంది. వీటిని దిల్లీలో జరగబోయే నీతి ఆయోగ్ సమావేశంలో ప్రజెంట్ చేద్దాం' అని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

## రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రపంచానికి పరిచయం చేస్తాం

ఐఏటీవో జాతీయ అధ్యక్షుడు రవి గోసేన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ విశాఖ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,000 మందికిపైగా ప్రముఖ టూర్, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లు, హోటల్ యజమానులు, డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ సంస్థలు, పర్యాటక పారిశ్రామికవేత్తలు హాజరవుతారన్నారు. ఏపీ పర్యాటక రంగ భాగస్వాములు పెద్దసంఖ్యలో పాల్గొనేలా రిజిస్ట్రేషన్ ఫీజును రూ.6వేలకు బదులు రూ.3వేలు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత రెండేళ్లలో ప్రైవేటు రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇటీవల జీటీఎం (గ్లోబల్ ట్రావెల్ మార్ట్) పురస్కారం అందుకున్నామని గుర్తు చేశారు. ఐఏటీవో జాతీయ అధ్యక్షుడు రవి గోసేన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విశాల తీర ప్రాంతం ఉందని, బుద్ధిస్టు టూరిజం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయని తెలిపారు. కొత్త పర్యాటక ప్రాంతాలపై ప్రాచుర్యం కల్పించి రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై పర్యాటకానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

## ఎమంత్రి చెప్పినా వినరా?.. తెనాలి మున్సిపల్ అధికారులపై నాదెండ్ల ఆగ్రహం

పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవుపెట్టి వెళ్లండని హెచ్చరించారు. వ్యర్థాలు తొలగించే వరకు ఇక్కడే ఉంటానని కాల్వగట్టుపై ఉన్న బల్లపై కూర్చున్నారు. దీంతో హడావుడిగా అక్కడికి చేరుకున్న మున్సిపల్ యంత్రాంగం.. చెత్త తొలగింపు పనులు చేపట్టింది.

## దేశవ్యాప్తంగా బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్

ఆ తర్వాత భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లతో కలిసి తిరుపతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏపీకి కేంద్రం నుంచి అందిన సహకారం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. యూపీఏ హయాంతో పోలిస్తే ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలనలో ఏపీకి 325 శాతం అధికంగా నిధులు ఇచ్చామని ప్రహ్లాద్ జోషి తెలిపారు. మోదీ మార్గదర్శనం, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో రాజధాని అమరావతి నిర్మాణమవుతోందన్నారు. వారిద్దరూ 'చూద్దాంలే.. చేద్దాంలే' అనే ధోరణితో వ్యవహరించరని, ఇద్దరికీ స్పష్టమైన విజన్ ఉందన్నారు. కేంద్రం అమరావతికి రూ.15వేల కోట్లు ఇవ్వడంతోపాటు హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు, అమరావతిని ప్రధాన నగరాలతో అనుసంధానించే రైల్వేలైన్‌కు రూ.2,245 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. 'విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం సాయం చేసింది. పోలవరం ప్రాజెక్టుకు గతేడాది డిసెంబరు నాటికి రూ.20,658 కోట్లు విడుదల చేశాం. కేంద్ర బడ్జెట్‌లో మరో రూ.3,300 కోట్లు కేటాయించారు. దక్షిణకోస్తా జోన్ మంజూరు చేసి రూ.10,134 కోట్లు ఇచ్చాం. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేకంగా గ్రాంట్లు అందించాం' అని ప్రహ్లాద్ జోషి చెప్పారు. తొలుత విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన కార్మికులకు సంతాపం తెలిపారు. ప్రధానిగా మోదీ సాధించిన విజయాలు, తీసుకొచ్చిన సంస్కరణలపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

## కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ విచ్చలవిడిగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. "గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా అభివృద్ధి చేశాం. కుట్రలు, కుతంత్రాలు చేయడం తప్ప జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి అస్సలు పట్టదు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు" అని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలందరికీ వివరించబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

## నేతల సిఫార్సుల కంటే.. ప్రజల అవసరాలే ముఖ్యం

ఇదే విధానాన్ని అమలు చేస్తున్నాయి. ప్రైవేటు సంస్థలకు మున్సిపల్ ఆస్తులు కట్టబెట్టడం లేదు కదా' అని మంత్రి ప్రశ్నించారు. 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.3,600 కోట్లు కేటాయించింది. రాష్ట్ర వాటా కింద మరో రూ.10,800 కోట్లు సమీకరించాలి. ఇందు కోసం హడ్కో సహకరిస్తోంది. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) నెలాఖరులోగా పోర్టల్‌లో అధికారులు అప్‌లోడ్ చేయాలి. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఇప్పటికే రూ.20 వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. ప్రజలకు తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది' అని మంత్రి నారాయణ వివరించారు.

జాతీయ సగటు కంటే వేగవంతమైన ఆర్థిక వృద్ధి రేటుతో ఏపీ: హడ్కో సీఎండీ

జాతీయ సగటు కంటే వేగవంతమైన ఆర్థిక వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోందని హడ్కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సంజయ్ కులశ్రేష్ఠ ప్రశంసించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నిధులు అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందంజలో ఉందని ఆయన అన్నారు. అమరావతి నగరం రూపుదిద్దుకున్న తీరును అభినందించారు. నిరంతరం శ్రమించి వాణిజ్య విలువలు, నిబంధనలను బ్యాలెన్స్ చేస్తూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని సుస్థిర ప్రగతి వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల కోసం కృత్రిమ మేధ, క్వాంటమ్ వ్యాలీ, డిఫెన్స్, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాల్లో పట్టణ స్థానిక సంస్థలు ప్రాజెక్టులను చేపట్టాలని సీఎండీ సూచించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, సంచాలకుడు సంపత్‌కుమార్ 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'ను సాధించేందుకు కమిషనర్లు ఏవిధంగా ప్రణాళికలు, డీపీఆర్‌లు తయారు చేయాలనే విషయమై సూచనలు చేశారు. మున్సిపల్ ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## దిగ్గజ దర్శకుడు భారతీరాజా కన్నుమూత

పరిశ్రమతో పాటు యావత్ భారత సినీ లోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

ఆయనకు భార్య చంద్రలీల, కుమారుడు మనోజ్, కుమార్తె జనని ఉన్నారు. గతేడాది మార్చి 2025లో భారతీరాజా కుమారుడు, నటుడు మనోజ్ భారతీరాజా (48) గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. పుత్రశోకం ఆయన్ను తీవ్రంగా కుంగదీసింది. అప్పటి నుంచి మానసిక ఒత్తిడి, శ్వాసకోశ సమస్యలతో ఆయన ఆరోగ్యం క్షీణించింది. పలుమార్లు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఈ ఏడాది ఆరంభంలో కూడా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా ఆసుపత్రిలో చేరినప్పటికీ, పరిస్థితి విషమించడంతో ఆయన కన్నుమూశారు. 1941 జూలై 17న తమిళనాడులోని తేని సమీపంలో ఉన్న అల్లినగరం గ్రామంలో జన్మించిన భారతీరాజా అసలు పేరు చిన్నసామి. 1977లో వచ్చిన '16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. గ్రామీణ జీవితాన్ని అత్యంత సహజంగా తెరకెక్కించిన ఈ చిత్రం తమిళ సినిమా గతిని మార్చేసింది. శ్రీదేవి, రజినీకాంత్ వంటి నటులకు ఈ సినిమా పునాది వేసింది. తెలుగులో ఈ చిత్రాన్ని 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ చేయగా ఇక్కడా ఘన విజయం సాధించింది. ఐదు దశాబ్దాల తన సుదీర్ఘ కెరీర్‌లో భారతీరాజా దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించారు. కిళక్కే పోగుమ్ రైల్, సిగప్పు రోజాక్కళ్, ముదల్ మరియాద్రై, వేదం పుదిదు వంటి చిత్రాలతో కుల వ్యవస్థ, గ్రామీణ సమస్యలు, మానవ సంబంధాలను సున్నితంగా తెరకెక్కించారు. తెలుగులో ఆయన తీసిన 'సీతాకోకచిలుక', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి చిత్రాలు కూడా క్లాసిక్‌లుగా నిలిచిపోయాయి. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. కార్తీక్, రేవతి వంటి ఎందరో నటీనటులను ఆయన పరిశ్రమకు పరిచయం చేశారు. తెలుగులో సూపర్ హిట్ చిత్రం 'మంగమ్మ గారి మనవడు' చిత్రానికి కథ అందించింది భారతీరాజానే. 1994లో వచ్చిన 'పల్నాటి పౌరుషం' సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకొకచిలుక' చిత్రం తెలుగులో ఉత్తమ చిత్రంగా జాతీయ పురస్కారం అందుకుంది. 1981లో ఈ చిత్రానికి గాను భారతీరాజాను ఉత్తమ దర్శకుడిగా నంది పురస్కారం వరించింది. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు గాను ఆరు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, పద్మ పురస్కారం వరించాయి. 2004లో కేంద్రం ఆయనను పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. అభిమానులు ముద్దుగా 'మిరాకిల్ డైరెక్టర్' అని పిలుచుకునే భారతీరాజా మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అంత్యక్రియలకు సంబంధించిన వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా


### పర్చూరు నియోజకవర్గంలో మరో 59 మందికి

### రూ.44 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు




(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 10)

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తూ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం పర్చూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన 59 మంది లబ్ధిదారులకు రూ.44,00,383 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం భారీగా ఖర్చులు భరించలేని కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల దరఖాస్తులను వేగంగా పరిశీలించి సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రియింబర్స్‌మెంట్ మరియు ఎల్‌వోసీ ద్వారా మొత్తం 1,970 మందికి రూ.17.50 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించబడిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడించారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం సంతోషకర విషయమని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందేలా చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
11.06.26 గురువారం


# తహశీల్దార్ పై పోలీసులకు ఫిర్యాదు

షణ్ముఖ వెలుగు ఎఫెక్ట్

**తహశీల్దార్ అక్రమ ఆన్‌లైన్‌ల పై విచారణకు కలెక్టర్ ఆదేశం**
**తహశీల్దార్ జయలక్ష్మి బదిలీ ఉత్తర్వులు వచ్చిన పిదప చేసిన మ్యూటేషన్ ఫైల్స్ ఇవ్వాలని ఆర్డీఓ ఆదేశం**


తేది - 10-06-2026
...
ఇట్లు
తమ విధేయుడు
V. Narasimha Rao
9848751695




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 10)**
బదిలీ పై వెళుతూ అక్రమ ఆన్‌లైన్‌లకు బరితెగించిన తహశీల్దార్ నర్రా జయలక్ష్మి పై భూ హక్కుదారులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కనిగిరి పట్టణానికి చెందిన ఉప్పాల నరసింహారావు వారి సోదరులు 2023 డిసెంబర్ 6న సర్వే నెంబర్ 289/సి, ఏ, 311/ఏ, 311/సి, 568, 649/2 లో య1.38సెంట్లు కొనుగోలు చేశారు. కానీ దానిలో కొంత భూమిని బదిలీ పై వెళ్ళిన తహశీల్దార్ ఎన్ జయలక్ష్మి అక్రమంగా ఆన్‌లైన్ చేసి భారీ అవినీతికి పాల్పడిన విషయం పాఠకులకు విధితమే. అక్రమ ఆన్‌లైన్‌కు పాల్పడిన తహశీల్దార్ నర్రా జయలక్ష్మి, అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న పంచాగ్నుల వెంకట సుబ్బయ్య, అక్రమ ఆన్‌లైన్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకున్న తాళ్ళ శ్రీనివాసరెడ్డి, అందుకు సహకరించిన నలుగురు దళారుల పై ఉప్పాల నరసింహారావు బుధవారం కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న ఎస్ఐ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్ తెలిపినట్లు బాధితులు ఉప్పాల నరసింహారావు తెలిపారు.

**వివాదాలకు కేరాఫ్ ఆ తహశీల్దార్....**
కనిగిరిలో కనిగిరి తహశీల్దార్ గా రెండు రోజుల క్రితం వరకు పని చేసిన నర్రా జయలక్ష్మి విధుల్లో చేరిన నాటి నుంచి వివాదాల్లో నిలుస్తూనే ఉన్నారు. ఎక్కువగా జోక్యం చేసుకుంది. కార్యాలయానికి వచ్చిన టిడిపి వికలాంగుల శాఖ అధ్యక్షుడు తిరుపతి పై పోలీసులకు ఫిర్యాదు చేసి అకారణంగా కొద్ది గంటల పాటు స్టేషన్‌లో ఉంచింది. అంతే గాక పామూరు రోడ్డులో డొంక పోరంబోకు భూమికి పొజిషన్ సర్టిఫికేట్‌లు ఇచ్చి తానేమి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వలేదని కలెక్టర్, జెసి ల వద్ద నిస్సిగ్గుగా చెప్పడంతో తోటి తహశీల్దార్లు ఛీఛీ ఇదేంటని విస్తుపోయిన పరిస్థితి నెలకొంది. మార్కాపురం జిల్లా ఏర్పడిన తరువాత జిల్లాలోని కనిగిరి మండలానికి కలంకం తెచ్చిన చరిత్ర కూడా తహశీల్దార్ విజయలక్ష్మిదే....

**తహశీల్దార్ అక్రమ ఆన్‌లైన్‌ల పై విచారణకు కలెక్టర్ ఆదేశం...**
బదిలీ పై యర్రగొండపాలెం వెళ్ళిన తహశీల్దార్ ఎన్ జయలక్ష్మి అక్రమ ఆన్‌లైన్ ల పై జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత విచారణకు ఆదేశించారు. తహశీల్దార్‌కు బదిలీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత చేసిన ఆన్‌లైన్ ల పై మొదట విచారణ జరపాలని ఆర్‌డిఓ అజయ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు తహశీల్దార్ నర్రా జయలక్ష్మి బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత చేసిన మ్యూటేషన్ ఫైళ్ళను అందజేయాలని ఆర్డీఓ ఆదేశించినట్లు తహశీల్దార్ కేవీఎం కృష్ణ ప్రసాద్ వెలుగు ప్రతినిధికి తెలిపారు.



## ఎన్ఎస్పి ఆధునికరణకు ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం

రూ.2.50 కోట్ల పనులకు ఎమ్మెల్యే ఏలూరి శంకుస్థాపన

రైతుల భాగస్వామ్యంతో సాగునీటి వ్యవస్థ బలోపేతం చేయాలని పిలుపు

బొల్లాపల్లి మేజర్ కాలువ పై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలూరి

వైసిపి హయాంలో సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం

నీటి ఎద్దడి లేకుండా చెరువులన్నీ సాగర్ జలాలతో నింపాం

4



## కంచర్ల శ్రీను హత్య కేసులో 13 మందికి యావజ్జీవ శిక్ష

**శిక్ష విధించిన న్యాయమూర్తి భవాని**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 10)**
కంచర్ల శ్రీనును హత్య చేసిన కేసులో 13 నిందితులకు యావజ్జీవ శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మార్కాపురం జిల్లా కోర్టులోని 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి భవాని బుధవారం తీర్పు ఇచ్చారు. హత్య కేసులో నిందితులకు శిక్ష పడటంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. హత్య కేసు వివరాల్లోకి వెళితే (తరువాయి 4లో...)



## అందుబాటులో ఉన్న భూముల సమగ్ర వివరాలను రెండు వారాలలోగా ప్రభుత్వానికి నివేదిస్తాం

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు, దొనకొండ, జూన్ 10)**
దొనకొండలో పారిశ్రామిక అవసరాలకు అందుబాటులో ఉన్న భూముల సమగ్ర వివరాలను రెండు వారాలలోగా ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అద్దంకి ఆర్డిఓ విజయజ్యోతి కుమారిలతో కలిసి దొనకొండ మెగా పారిశ్రామిక హబ్‌లోని వివిధ బ్లాకులను సందర్శించారు. (తరువాయి 4లో...)

# వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి పార్టీ

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 10)**
వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ పార్టీ అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి పాలనలో అభివృద్ధిపథంలోకి దూసుకుపోతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ రోజుకు 18 గంటల పాటు కష్టపడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో (తరువాయి 4లో...)



## పల్లెనిద్ర, గ్రీవెన్స్ రద్దు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 10)**
ఈ నెల 11వ తేదీ సాయంత్రం చిన్న పవని గ్రామంలో నిర్వహించదలచిన ' పల్లెనిద్ర ' కార్యక్రమంతో పాటు 12వ తేదీన లింగసముద్రం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించవలసిన నియోజకవర్గస్థాయి ' మీకోసం ' కార్యక్రమాలను కొన్ని అనివార్య కారణాల వలన రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలు దీనిని గమనించాలని ఆయన సూచించారు.

# వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసిపి పార్టీ

అన్ని రకాలుగా నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని అన్నారు. వైసిపి నాయకులు ఏ ముఖం పెట్టుకుని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ పార్టీ అని ఉదాహరణలతో సహా వివరించారు. పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేసి ఈ ప్రాంత ప్రజలను వెన్నుపోటు పొడిచింది వైసీపీ పార్టీ కాదా, రూ.3,000 పెన్షన్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి మాట మార్చి నాలుగున్నర సంవత్సరాల తర్వాత రూ.3,000 ఇచ్చి అవ్వ, తాతలను, వికలాంగులు, వితంతువులను వెన్నుపోటు పొడిచింది వైసిపి పార్టీయా కాదా... ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటిలో ఒకరికి ఆ పథకాన్ని పరిమితం చేసి విద్యార్థుల తల్లిదండ్రులను వెన్నుపోటు పొడిచింది వైసీపీ పార్టీయా కాదా... సొంత తల్లి, చెల్లిని దగ్గరకు రానివ్వకుండా చివరకు వారిని మానసికంగా హింసించి వెన్నుపోటు పొడిచింది వైసిపి పార్టీయా కాదా.. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క తట్ట మట్టి పోయకుండా కొన్ని వేల ప్రాణాలను రోడ్లకు బలి చేసి వారి కుటుంబాలను వెన్నుపోటు పొడిచింది వైసిపి పార్టీయా కాదా.. పశ్చిమ ప్రాంతాన్ని గత ఐదు సంవత్సరాల వైసిపి పాలన కాలంలో అన్ని రకాలుగా నిర్లక్ష్యం చేసి ఈ ప్రాంత ప్రజలను అన్ని రకాలుగా వెన్నుపోటు పొడిచింది వైసిపి పార్టీయా కాదా... దీనిని బట్టి గత రెండు సంవత్సరాల క్రితమే ప్రజలు అన్ని రకాలుగా వెన్నుపోటు పొడిచింది వైసిపి పార్టీ అని నిర్ధారించుకొని 11 అంకె వేసి వైసిపి పార్టీని మూలన పడేసారన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు పిచ్చి ప్రేలాపణలు మానుకోవాలని హెచ్చరించారు. మంగళవారం మండల విద్యాశాఖ అధికారి అత్యంత వెనుకబడిన మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి స్థలం కావాలని కోరిన మీదట వారితో కలిసి తహసిల్దార్ ఆఫీస్‌కి వెళ్లి ఎండోమెంట్ ల్యాండ్ మినహాయించి ఏ భూమి స్కూలు బిల్డింగ్ అనుకూలమో అని తహసిల్దార్‌తో మాట్లాడి వచ్చామన్నారు. దాన్ని పలు రకాలుగా వక్రీకరించి వైసిపి అనుకూల పత్రికలు, వారి సొంత పత్రికల్లో పిచ్చిపిచ్చి రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. ఇటువంటి రాతలు రాస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చామని, మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా తెచ్చామన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. కష్టపడి పనిచేయడం తమ నాయకుడు తమకు నేర్పారని, ఈ ప్రాంత ప్రజల కోసం ఎంతైనా కష్టపడతానన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అయితే... వెన్నుపోటు, గొడ్డలి పోటుకు కేరాఫ్ అడ్రస్ వైసిపి పార్టీ అని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా జెవివి పోస్టర్ ఆవిష్కరణ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)

పొదిలి పట్టణంలోని ప్రజా సంఘాల భవనము నందు బుధవారం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, కార్యదర్శి బి దేవప్రసాద్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను డాక్టర్ ఎస్‌పి బాలయ్య, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు యు వెంకట్రావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు యు వెంకట్రావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో అధిక సంఖ్యలో సభ్యులను చేర్పించాలని కోరారు. డాక్టర్ ఎస్పీ బాలయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నందున వడ దెబ్బతినే అవకాశం ఉందని ఒక జాగ్రత్త తీసుకోవాలని విద్యార్థులు ఫోన్లకు బానిసలు అవ్వకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలని సూచించి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల కోసం ప్రగతి కోసం సోమలంబన కోసం జన విజ్ఞానం వేదిక పనిచేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు గుంటూరి ఐజాక్ బాబు, పి ఆంజనేయ చౌదరి, ఎం శ్రీనివాసరావు, జూపల్లి వెంకటేశ్వర్లు, వెంకట్ ప్రభుదాసు, పత్రా పిచ్చయ్య, ప్రధానోపాధ్యాయులు ఎస్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## దర్శకుడు భారతీరాజా మరణం

### సినీ రంగానికి తీవ్ర లోటు

### ద్రావిడ దేశం కృష్ణారావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

తన సుదీర్ఘ సినీరంగ ప్రయాణంలో తమిళ సంస్కృతికి ప్రత్యేక పీట వేసిన ప్రముఖ సినీ దర్శకులు భారతీరాజా మరణించడం భారతదేశ సినీ రంగానికి తీవ్రలోటని ద్రావిడ దేశం అధ్యక్షులు వి కృష్ణారావు తమ సంతాపాన్ని తెలియజేశారు. గ్రామీణ మట్టి వాసన ఉట్టిపడేలా అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా తాను సినిమాలను దర్శకత్వం వహించారని కృష్ణారావు కొనియాడారు. సినీ రంగానికి సేవ చేయాలనే సంకల్పంతో తన 85 ఏళ్ల వయసులో కూడా భారతీరాజా సినిమాలో నటించారు అని తెలిపారు. ఒక్క తమిళ సినీ రంగంలో మాత్రమే గాక ఇతర భాషా సినీ రంగాలలో కూడా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని భారతీరాజా పొందారు. అటువంటి గొప్ప దర్శకుని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆదేశించడం కూడా స్వాగతిస్తున్నామని కృష్ణారావు అన్నారు. భారతీరాజా ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు ద్రావిడ దేశం కృష్ణారావు ఈ రోజు విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు.

## అందుబాటులో ఉన్న భూముల సమగ్ర వివరాలను రెండు వారాలలోగా ప్రభుత్వానికి నివేదిస్తాం





ఈ హబ్ లో పరిశ్రమల స్థాపనకు వచ్చిన ప్రతిపాదనలు, అవసరతలు, స్థానిక పరిస్థితుల పై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయా అంశాలపై తహసిల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. దొనకొండ ప్రాంతాన్ని 25వేల ఎకరాలతో పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇప్పటికే బీడీఎల్, ఏపీజిఈసి, భవ్య ఇండస్ట్రీ సంస్థలు ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చాయన్నారు. బీడీఎల్ సంస్థ కోరిన స్థలం సమీపంలోనే హెయిర్ స్ట్రిప్ ఉండడంతో క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించేందుకు తాను వచ్చినట్లు చెప్పారు. ఈ 25 వేల ఎకరాలతో కూడిన హబ్ లో భూసేకరణ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ, పట్టా, అసైన్డ్, పోరంబోకు తదితర రకాల భూముల సర్వేను కూడా రెండు వారాల్లోగా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

**నీటి ఇబ్బందులు తొలగించాము**

దొనకొండ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసినవారికి బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లించామన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా కూడా ఈ ప్రాంతానికి నీళ్లు రప్పించి పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట ఎంపీడీవో వసంతరావు నాయక్, తహసిల్దార్ రమాదేవి, ఇతర అధికారులు ఉన్నారు.

## ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా ఉత్తమ మార్గం

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు







(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 10)

ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుండే యోగ సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో జరుగుతున్న యోగ సాధనలో భాగంగా బుధవారం సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ పంచభూతాల సంగమ ప్రాంతంలో ఉత్సాహంగా వారు యోగ సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా అంటే కేవలం కసరత్తు మాత్రమే కాదనీ, తనువును, మనస్సును, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి నుంచే యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలందరి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం 'యోగాంధ్ర' కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన పాకల బీచ్‌లో యోగా కార్యక్రమం నిర్వహించడం పర్యాటకానికి, ఆరోగ్యానికి రెండింటికీ మంచిదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య స్పృహతో యోగాను ఆచరించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువల పెంపునకు కూడా దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. పతంజలి యోగా సంస్థ నిపుణుల పర్యవేక్షణలో సముద్ర తీరంలో విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## కంచర్ల శ్రీను హత్య కేసులో 13 మందికి యావజ్జీవ శిక్ష

ఈ హత్య పాత కక్షల, దీర్ఘకాలిక వైరం కారణంగా జరిగిన దారుణ హత్యకు సంబంధించినది. పొదిలి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కంచెర్ల శ్రీను (35)ను హత్య చేయాలని 13 మంది నిందితులు ముందస్తుగా కుట్ర పన్ని, 17.05.2017 రాత్రి మృతుడు పొదిలిలో జరిగిన వివాహ వేడుకకు హాజరై తిరిగి తన మోటార్ సైకిల్ పై స్వగ్రామమైన రాజుపాలెంకు వెళ్తుండగా, రాజుపాలెం గ్రామ శివారులోని బాప్టిస్టుపాలెం రోడ్డు పై నిందితులు అతన్ని అడ్డగించి మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో మృతుడు తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటన విషయం తెలుసుకున్న మృతుడి భార్య సంఘటనా స్థలానికి చేరుకుని తన భర్త రక్తపు మడుగులో పడి ఉండటం గమనించింది. పాత కక్షల నేపథ్యంలో హత్య చేశారని భావించిన ఆమె నిందితుల పై పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అప్పట్లో మర్రిపూడి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఇన్‌చార్జ్ పొదిలి పోలీస్ స్టేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వై శ్రీహరి పొదిలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. పోలీస్ సిబ్బంది సాక్షులను కోర్ట్ లో సమయానుసారం హాజరు పరుస్తూ మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మార్గదర్శకత్వంలో పటిష్టమైన గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా సమర్థవంతంగా విచారణ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితుడు పై నేర నిరూపణ చేశారు. దీంతో నిందితులు చల్లా వెంకటేశ్వర్లు, చల్లా వెంకట నరసింహం, సన్నెబోయిన కృష్ణయ్య, చల్లా శ్రీను, చల్లా అనిల్, లోమడ హరిబాబు, చలివేంద్ర ప్రసాద్, చల్లా రమేష్, చల్లా నాగయ్య, దోసపాటి వెంకయ్య, దోసపాటి శ్రీనివాసులు, జూపల్లి శివయ్య, చల్లా రవిలకు న్యాయమూర్తి వేల్పుల భావాని 13 నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో ముద్దాయిలకు శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం విజయలక్ష్మి, అప్పటి పొదిలి సీఐ ఎం శ్రీనివాసరావు, ప్రస్తుత పొదిలి సీఐ ఎం రాజేష్ కుమార్, అప్పటి మర్రిపూడి పోలీస్ స్టేషన్, పొదిలి ఇన్‌ఛార్జి ఎస్ఐ, ప్రస్తుతం సింగరాయకొండ సిఐ వై శ్రీహరి, ప్రస్తుత పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్, కోర్ట్ లైజన్ సిబ్బంది శ్రీనివాసులు, పొదిలి కోర్ట్ కానిస్టేబుల్ యు రాజా రత్నంలను మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్ఎస్పి ఆధునికరణకు ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 10)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పి) పరిధిలో సాగునీటి వ్యవస్థను పటిష్టం చేసి చివరి ఆయకట్టు భూముల వరకు నీరు అందించడమే లక్ష్యంగా ఆధునికరణ పనులకు శ్రీకారం చుట్టామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. బొల్లాపల్లి మేజర్ కాలువపై రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న కట్టల బలోపేతం, కాలువల ఆధునికరణ, సిల్ట్ తొలగింపు పనులకు ఎమ్మెల్యే బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు మరియు సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో ఈ పనులు చేపడుతున్నామని, నీటి పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించి చివరి భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం కీలకమని, ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంగా పనిచేసి పనుల నాణ్యతపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ఎమ్మెల్యే ఏలూరి విమర్శించారు. నీటి విడుదలకు సంబంధించి స్పష్టమైన షెడ్యూల్ కూడా ప్రకటించకుండా రైతులను అనిశ్చితిలో ఉంచారని ఆరోపించారు. ఫలితంగా కాలువల నిర్వహణ నిర్లక్ష్యానికి గురై వ్యవస్థలు దెబ్బతిన్నాయని అన్నారు. అయితే 2014-2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కాలువల ఆధునికరణకు ప్రాధాన్యత ఇచ్చి అనేక పనులు చేపట్టామని గుర్తు చేశారు. అనంతర సంవత్సరాల్లో నిర్వహణ లోపంతో అనేక సాగునీటి వ్యవస్థలు కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కాలువల నిర్వహణ, నీటి పంపిణీ, మరమ్మతుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనులు పూర్తయిన అనంతరం సాగునీటి సరఫరా మరింత మెరుగుపడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం నీటి ఎద్దడి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని, నియోజకవర్గంలోని చెరువులను సాగర్ జలాలతో నింపడం ద్వారా సాగు, తాగునీటి అవసరాలను తీర్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. భవిష్యత్తులో కూడా సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, తాటి నాగేశ్వరరావు, పొద వీరయ్య, ఈఈ సతీష్, డిఈ జయశంకర్‌రావు, సాగునీటి శాఖ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, పొదిలి, జూన్ 10)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి రెండవ బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల తెలుగుదేశం పార్టీ సమావేశాల్లో భాగంగా బుధవారం పొదిలి మండల, కొనకనమిట్ల మండలాల సమావేశాల్లో పాల్గొన్నారు. మార్కాపురం మండల, పట్టణ, తర్లుపాడు మండలాల సమావేశం ఆయా మండల పార్టీల అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ పరిశీలకులు వహీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశామని, గత వైసిపి ప్రభుత్వం కంటే మిన్నగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని, ఇచ్చిన మాట కట్టుబడి మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించామని, త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని, మార్కాపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని, మునుపెన్నడూ లేని విధంగా మార్కాపురం నియోజకవర్గంలో రూ.3,000 కోట్ల రూపాయలతో కొనకనమిట్ల మండలంలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే దాన్ని పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు భారీ ఎత్తున కల్పిస్తామని దీని ద్వారా రైతులకు పెద్ద ఎత్తున ఆర్థిక లాభం చేకూరుతుందని అన్నారు. మనం చేస్తున్న ఈ అభివృద్ధిని మన కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని తద్వారా వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేటు తో విజయం సాధించాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం మార్కాపురంలో ఒక ప్రభుత్వ స్కూల్‌ను సందర్శించానని అప్పుడు ఒక మండల విద్యాధికారి ఒక బిల్డింగ్‌కు స్థలం అవసరమవుతుందని తనను అడగగా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆ స్థలం కోసం తాను తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లానని కానీ "ఆత్మసాక్షి" లేని ఒక దినపత్రిక వలువలు చిలువలు చేసి నానా రకాల కథలు వండి వార్చి తనపై తప్పుడు ఆరోపణలు రాశారని ఇటువంటిప్పుడే కార్యకర్తలు నాయకులు ఐక్యంగా ఉండి వాటిని ముక్త కంఠంతో ఖండించాలని తెలుగుదేశం నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే సర్ ప్రోగ్రాంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, యూనిట్ కో ఇన్‌ఛార్జిలు, పార్టీ నియమించిన సర్ ప్రోగ్రామ్ ఇన్చార్జులు, బీఎల్‌వోలు జాగ్రత్తగా ఉండి హౌస్ మ్యాపింగ్, ఓటర్ వెరిఫికేషలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశాలలో పొదిలి, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, మూరబోయిన బాబురావు యాదవ్, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, గొట్లగట్టు మాజీ సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెలిగొండ దేవస్థాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, పొదిలి పట్టణ అద్యక్షులు ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గునుపూడి భాస్కర్, మీగడ ఓబుల్‌రెడ్డి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు ఎస్ ఎం భాష, షేక్ షబ్బీర్, పొదిలి మేజర్ పంచాయితీ మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలానీ బాష, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ పై అవగాహన పెంచుకోవాలి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 10)

కార్యకర్తలు 'సర్' పై అవగాహన పెంచుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు పోద వీరయ్య అన్నారు. బుధవారం మండల టిడిపి కార్యాలయంలో 'సర్' (స్పెషల్ ఇంటొన్సివ్ రివిజన్ 2026) పై మండల నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## అక్రమ విద్యుత్ వాడకం పై విజిలెన్స్ దాడులు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 10)

అక్రమ విద్యుత్ వాడకంపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం మండల పరిధిలో 40 బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 117 కేసులు నమోదు చేసి 4 లక్షల 55 వేల 5 వందల రూపాయలు అపరాధ రుసుములు వేసినట్లు మార్కాపురం పర్యవేక్షక ఇంజనీరు పివి నాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ సర్వీసుల తనికిలు విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయన్నారు. విద్యుత్ చౌర్యం పై ఫిర్యాదులను 9281883901 నంబర్ ద్వారా పూర్తి సమాచారాన్ని నేరుగా గాని, వాట్సాప్ ద్వారా గాని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్యూటివ్ ఇంజనీర్ టి హైమావతి, ఎక్స్యూటివ్ ఇంజనీర్ ఎ సత్యనారాయణ , డిఈఈ పి జి నారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె కోటయ్య, త్రిపురాంతకం విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సిహెచ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మరువలేని మనిషి, మరపురాని మనిషి డాక్టర్ కటారి రాజు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)

పేదల డాక్టర్ గా పేరు పొందిన డాక్టర్ కటారి రాజు మహా మనిషి, స్వార్థం, గర్వం లేని త్యాగమూర్తి అని తన శిష్యులందరికీ చక్కని భవిష్యత్తును ఏర్పరచిన మార్గదర్శి అని, ఆయన శిష్యుడు, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ ఇమాంసా అన్నారు. రాజు జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కటారి రాజు పుట్టినరోజు సందర్భంగా రాజు క్లినిక్ నందు ఆయన కుమారుడు కటారి భరత్ చంద్ర ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పవన్, డాక్టర్ సంధానిభాష, మోరబోయిన వెంకి, మాజీ వార్డ్ మెంబర్ మస్తాన్, ఖాసిం పీరా, చిన్న రాజు, నరసింహారాజు, రాజు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది నుండి ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారానే యూరియా, డిఏపి ఎరువులు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)

ప్రతి రైతుకు సరైన సమయంలో ఎరువులు అందించాలన్న లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నూతన వరవడికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా యూరియా, డిఏపి ఎరువులు పంపిణీకి అవకాశం కల్పిస్తుంది. రైతులు తమ ఆధార్ నెంబర్ చెప్పి వారికి నచ్చిన ఎరువుల దుకాణాల నుంచి అవసరమైన ఎరువులు తీసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ఈ యాప్ ద్వారా యూరియా, డిఏపి వంటివి ఎరువులు పక్కదారి పట్టే అవకాశం ఉండదు అని నిర్దేశిత సమయానికి రైతులందరికీ ఎరువులు అందుతాయని ఈ విషయమై మండలం లోని రైతు సేవ కేంద్రం సిబ్బందికి, డీలర్లకు ఈ యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. 2026 ఖరీఫ్ పంట కాలంలో సాగు చేసే పంటల వివరాల ఆధారంగా యూరియా, డీఏపీ పంపిణీ చేస్తారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది మండలాల్లోని ప్రైవేటు ఎరువుల దుకాణలను యాప్ నందు అనుసంధానం చేసి వారి వద్ద ఉన్న ఎరువులు పక్కదారి పట్టకుండా కూడా నిఘా పెడతామని తెలిపారు. ఖరఫ్ సీజన్లో రైతు సాగు చేయబోయే పంటల వారీగా ఈ పంట నమోదులో వివరాలు మార్పులు చేర్పులకు లాగిన్‌లో అవకాశం కల్పించారు. రైతు పేరు, పంట, రకం, విస్తీర్ణం మార్చుకోవచ్చన్నారు. అదే విధంగా సాగులో అవసరాన్ని మించి ఎరువులు వినియోగించకుండా ఏ పంటకు ఎంత అవసరమో అంత మోతాదులో ఇచ్చేలా సాంకేతికతను ఈ యాప్ నందు రూపొందించారని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా తొలి దఫా యూరియా, డిఏపి కొనుగోలు చేసిన రైతు తర్వాత మరలా రెండో దఫా తీసుకునేందుకు 20 రోజులు సమయం పడుతుందని ఏఓ తెలిపారు.

## పాఠశాలల పునఃప్రారంభానికి సమగ్ర ఏర్పాట్లు చేయాలి

### ఎంఈవో1 అబ్దుల్ సత్తార్




(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 10)

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో-1 అబ్దుల్ సత్తార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ, తరగతి గదులు,మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి ట్యాంకులు తదితర ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరచి విద్యార్థుల రాకకు సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో పెరిగిన కలుపు మొక్కలు, చెత్తాచెదారం, నిల్వ నీరు వంటి వాటిని తొలగించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పాడైన వైరింగ్, విరిగిన స్విచ్ బోర్డులు, బహిర్గతమైన విద్యుత్ తీగలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఫ్యాన్లు, లైట్లు, విద్యుత్ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే పరిశీలించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా నీటి ట్యాంకులు, ఫిల్టర్లు శుభ్రపరచాలని, అవసరమైన చోట క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, వంట పాత్రల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరమైన చెట్లు, విరిగిన గోడలు, పాడైన ఫర్నిచర్ వంటి వాటిని గుర్తించి వెంటనే సరిచేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు పెంపు కోసం మొదటి రోజు నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు రప్పించే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కొత్తగా చేరే విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమాలు నిర్వహించి ఆత్మీయ వాతావరణం కల్పించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫార్ములు, తదితర బోధనా సామగ్రి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుని పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రతి పాఠశాల "స్వచ్ఛ పాఠశాల-సురక్షిత పాఠశాల" లక్ష్యంతో పనిచేయాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రమాణాల పెంపే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఎంఈవో-1 అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించాలని ఆయన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

## పెద్దారవీడు మండల నూతన తహసీల్దార్‌గా సురేష్ బాబు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 10)

పెద్దారవీడు మండల నూతన తహసీల్దార్‌గా సురేష్ బాబు బుధవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. గతంలో కొనకనమిట్ట మండల తహసీల్దార్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన ఆయనకు పెద్దారవీడులో ఘన స్వాగతం లభించింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన రామకృష్ణ ఇక పై డిప్యూటీ తహసీల్దార్‌గా తన విధులను కొనసాగించనున్నారు. నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకార సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) సుబ్బారెడ్డి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు కలిసి సురేష్‌బాబును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాల బాలికలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొండపి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సుశీల దేవి





**(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 10)** మండల కేంద్రమైన కొండపిలో కిషోరి బాలికల సమ్మర్ క్యాంపు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా కొండపి ప్రాజెక్టు సిడిపిఓ సుశీలదేవి మాట్లాడుతూ బాల బాలికలకు మాదకద్రవ్యాలకు లోను కాకుండా మంచిగా చదవాలని అవగాహన కల్పించారు. సూపర్వైజర్ విక్టోరియా రాణి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయకూడదన్నారు. దాని ద్వారా టీనేజీ ప్రెగ్నెన్సీ వస్తే శిశు మరణాలు, మాతృ మరణాలు సంభవిస్తాయని తెలియజేశారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ రామ్మోహన్‌రావు ప్రసంగిస్తూ తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తు పై శ్రద్ధ పెట్టాలని, పిల్లలు దురాలవాట్లకు లోను కాకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె వాసవి, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, బాలబాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్‌గా కొండా శిరీష







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 10)** మండల రెవెన్యూ తహసిల్దార్‌గా కొండా శిరీష బుధవారం విధుల్లో చేరారు. ఈమెను కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా కలిసి బొకే, శాలువాలతో సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు జిల్లా, గూడూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో డిఏఓ గా పనిచేశారు. అనంతరం పదోన్నతి పై మార్కాపురం జిల్లా, పెద్దారవీడు మండల రెవెన్యూ తహసిల్దారు గా పనిచేస్తూ ప్రస్తు తం డిప్టేషన్ పై తర్లుపాడు మండల రెవెన్యూ తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కొండా శిరీష పాత్రికేయులతో మాట్లాడుతూ మండల ప్రజలు రెవెన్యూ సమస్యలు ఏవైనా తలెత్తినట్లయితే వెంటనే వారి సమస్యలను పరిష్కారదిశగా సహచర కార్యలయ సిబ్బంది సహాయ, సహకారాలతో తన వంతు శక్తివంచన లేకుండా రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడాని కృషి చేస్తానన్నారు. తహసిల్దార్‌ని మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికిన వారిలో తహసిల్దార్ కిషోర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ సింగిరెడ్డి లక్ష్మిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఉదయశ్రీ, మండల సర్వేయర్ సురేష్, మండల వీఆర్వోలు వై కాశి విశ్వేశ్వరరెడ్డి, రాజకుమారి, ఎస్కే మస్తాన్ వలి, డిమస్తానయ్య, కె శివకాశి, బి వెంకటేశ్వర్లు, డి ఖాసీంవలి, కార్యాలయ సబార్డినేటర్ లక్ష్మి, సిహెచ్ చెన్నయ్య, విఆర్‌ఏ జి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారెడ్డి సంఘం గిరిజన కాలనీలో ఇంటింటి సర్వే ఆపాలి

### గ్రామ సభ నిర్వహించాలి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 10)** గిరిజనుల ఇండ్లను ఖాళీ చేయించేందుకు ముందస్తు సమాచారం లేకుండా కరేడు ధర్మారెడ్డి సంఘంలో సచివాలయ ఉద్యోగులు, ఇండోసోల్ కంపెనీ వారు సంయుక్తంగా చేస్తున్న ఇంటింటి సర్వేని తక్షణమే ఆపివేయాలని, గ్రామసభ నిర్వహించి గిరిజనలందరి అభిప్రాయాలు తీసుకొని, గిరిజనులందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని చేయాలని బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ లో డిఏఓకి కాలనీ గిరిజనులు వినతి పత్రం సమర్పించారు. ముందుగా సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద కాలనీలో అధికారులు చేస్తున్న సర్వే ఆపాలని, ఇండోసోల్ కి తొత్తులుగా ఉన్న దళారులను అరికట్టాలని, గ్రామసభ నిర్వహించాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళన ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్, యానాది సంఘాల మహాకూటమి అధ్యక్షులు కత్తి బాలకోటయ్య మాట్లాడారు. గతంలో కరేడులో ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు ప్రజలు, గిరిజనులు ఐక్యంగా నిలబడి కాలనీల నుండి ఇండ్లను ఖాళీ చేయకుండా ఉద్యమం చేసి ఆపుకున్నామని తెలిపారు. సంవత్సరం తర్వాత అత్యంత గోప్యంగా, ఎవరికి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా కొంతమంది దళారులను కాలనీలో పెట్టుకొని, ఇండస్సోల్ కంపెనీ వారితో కుమ్మక్కయి హడావిడిగా నిన్న ప్రజలు అభ్యంతరం పెడుతున్న ఇంటింటికి సర్వే చేయాలని, మమ్మల్ని సబ్ కలెక్టర్ పంపాడని సాకుగా చెప్పి సచివాలయ ఉద్యోగులు సర్వే చేయడానికి ప్రయత్నించారని, గిరిజనులంతా ఐక్యంగా సర్వేను అడ్డుకున్నామని తెలిపారు. సబ్ కలెక్టర్ వచ్చి, గ్రామసభ పెట్టి, గ్రామస్థులతో చర్చించాలని కోరారు. అలా కానట్లయితే సచివాలయ సిబ్బందిని మా గ్రామంలోకి అడుగుపెట్టనీయమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజనులకు అండగా సిఐటియుఉంటుందని జిల్లా నాయకులు జివిబి కుమార్ తెలిపారు. అర్జీ యిచ్చిన అనంతరం సబ్ కలెక్టర్ హిమ వంశీతో ఫోన్ లో చర్చించారు. సచివాలయ ఉద్యోగులను మేము పంపలేదని, ధర్మారెడ్డి సంఘం గిరిజనులతో సోమవారం మాట్లాడతామని, సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు ఉలవపాడు మండల నాయకులు ఎస్‌డి గౌస్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పొట్లూరి రవి, యానాది సంఘాల మహాకూటమి ప్రకాశం జిల్లా కోశాధికారి కత్తి బాలకోటయ్యతో పాటు యానాదుల చైతన్య వేదిక అధ్యక్షుడు పి రవి, టిడిపి నాయకులు కత్తి కొండయ్య, ప్రధాన కార్యదర్శి కత్తి రామయ్య, కమిటీ సభ్యులు పొట్లూరు నటరాజు, గౌరవ సలహాదారులు తలపాల పెంచలరావు, పొట్లూరి లక్ష్మయ్య, పొట్లూరి ప్రసాదు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అమరావతి పునర్నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగం

### యాగంటి మల్లికార్జునరావు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 10)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తోంది. గతంలో నిర్లక్ష్యానికి గురైన అమరావతి రాజధానికి మళ్లీ జీవం పోసి, ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే మహత్తర కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తోంది. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదు, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రాజధాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండటం రాష్ట్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, జాతీయ రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు వేగంగా సాగుతుండటంతో ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటి సరఫరా కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంది. గ్రామాల్లో జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అండగా నిలుస్తూ ఎన్టీఆర్ పింఛన్ పథకం ద్వారా సామాజిక భద్రతను మరింత బలోపేతం చేసింది. రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. అదే విధంగా ప్రజలపై భారం తగ్గించేలా విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టి ప్రజాహిత నిర్ణయాలను అమలు చేస్తోంది. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాల పై కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తోంది. పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, అమరావతి నిర్మాణం వంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సుసంపన్నంగా మార్చనున్నాయి. రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని కోరుతున్నాను. అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని వెల్లడించారు.

## దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం సృష్టించిన ప్రధాని మోడీకి ప్రత్యేక పూజలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)** భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 4,398 రోజులు పరిపాలించగా నరేంద్ర మోడీ 4,399 పూర్తి చేసుకొనడమే కాకుండా ప్రజాప్రతినిధిగా (ఎమ్మెల్యే, ఎంపీగా, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా 8,930 రోజులు) పూర్తి చేసుకొని స్వతంత్ర భారతం సరికొత్త అధ్యాయంలోకి ప్రవేశించి ఈ దేశాన్ని అభివృద్ధి దిశలో ముందుకు నడిపిస్తున్న నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలియచేస్తూ పొదిలిలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటూ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి దేవస్థానం సమీపంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మైనారిటీ మోర్చా ప్రధానకార్యదర్శి సయ్యద్ ఖాదర్ బాషా, సీనియర్ బిజెపి నాయకులు మాగులూరి రామయ్య, పట్టణ అధ్యక్షులు నూతక్కి నాగేశ్వరావు, దోర్నాల నరసింహారెడ్డి, చిట్టెంశెట్టి శ్రీనివాసులు, షేక్ చిన్న బాషా, తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలి

### ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా శాఖ జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్‌రావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)** పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, ఐ ఆర్ తక్షణమే ప్రకటించాలని ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా శాఖ జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. ఒంగోలు ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ భవనంలో మీడియా సమావేశం నిర్వహించి.తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డిఎ, పిఆర్సి, ఎస్ఎల్ లకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటం కు ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని, రిటైర్డ్ ఉద్యోగికి రావలసిన బకాయిలను పేస్లిప్పులో చూపించాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇచ్చిన రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కూడా అమలు చేయాలని, ఐదు రోజుల పని దినాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా అనేక సమస్యలను వారు మీడియా సమావేశంలో తెలియజేశారు. సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఉద్యోగులందరూ ఉద్యమానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. జనరల్ సెక్రటరీ ఎస్ పోలయ్య ట్రెజరర్ జేబీఎస్ కుమార్, వైస్ చైర్మన్ ఊతకోలు శ్రీనివాసరావు, ఏపీహెచ్‌ఎం డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ యు వెంకట్రావు, సెక్రటరీ కె వెంకటేశ్వర్లు, ఒంగోలు డివిజన్ చైర్మన్ బి సాయి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలు పి సురేష్ బాబు, ప్రశాంత్, బి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహంతో కాళ్లకు పెనుముప్పు..
# నిర్లక్ష్యం చేస్తే అవయవ కోత తప్పదు!

దయాబెటిస్ బాధితుల్లో వేగంగా విస్తరిస్తున్న 'పీఏడీ' (పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్)

నరాల బలహీనతతో గాయాల తీవ్రతను పసిగట్టలేని దుస్థితి

అప్రమత్తత, దైనందిన పాదాల పర్యవేక్షణతోనే సురక్షితం

అందుబాటులో యాంజియోప్లాస్టీ వంటి అత్యాధునిక చికిత్సా విధానాలు

మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ డాక్టర్ ఎస్ శ్రీకాంత్ రాజు వెల్లడి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

మధుమేహ (డయాబెటిస్) వ్యాధిగ్రస్తులు ఏమాత్రం అప్రమత్తంగా ఉండకపోతే కాళ్లు కోల్పోయే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి పొంచి ఉందని యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) సీనియర్ వాస్కులర్, ఎండోవాస్కులర్ సర్జన్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శ్రీకాంత్ రాజు హెచ్చరించారు. ముఖ్యంగా డయాబెటిస్ బాధితుల్లో కాళ్లకు రక్తప్రసరణ నిలిచిపోయే 'పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్' (పీఏడీ) సమస్య రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో ఆయన ఈ నిశ్శబ్ద మహమ్మారి లక్షణాలు, తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. చక్కెర వ్యాధి అదుపులో లేని వారిలో ఈ ముప్పు అధికంగా ఉంటుందని, ముఖ్యంగా నరాల బలహీనత కారణంగా పాదాలకు గాయాలైనప్పుడు కనీసం నొప్పి కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతుందని డాక్టర్ శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు. నడుస్తున్నప్పుడు కాళ్లలో తీవ్రమైన భరించలేని నొప్పి రావడం, కొద్దిపాటి నడకకే విపరీతమైన అలసటకు గురికావడం, పాదాలు ఎప్పుడూ చల్లబడిపోవడం, పుండ్లు పడినా ఎంతకూ మానకపోవడం, కాలి వేళ్లు నల్లబడటం వంటివి ఈ వ్యాధిని సూచించే ప్రధాన లక్షణాలని తెలిపారు. ఈ తరహా ఇబ్బందులు ఏమాత్రం కనిపించినా అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్య నిపుణులను ఆశ్రయించాలని సూచించారు. చిన్నపాటి గీత, చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేస్తే, అది ప్రాణాంతకమైన పుండుగా మారి చివరకు కాలును తొలగించాల్సిన దుస్థితికి దారితీస్తుందని ఆయన కుండబద్దలు కొట్టారు. సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా కాళ్లను సురక్షితంగా కాపాడుకోవచ్చని, ఇందుకు డాప్లర్ స్కాన్, కాళ్ల రక్తప్రసరణ పరీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయని వైద్యులు వెల్లడించారు. రోగులు తమ రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అదుపులో ఉంచుకోవడంతో పాటు పొగతాగే




అలవాటును తక్షణమే మానుకోవాలని సూచించారు. ప్రతిరోజూ పాదాలను నిశితంగా పరిశీలించుకోవడం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఒకవేళ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ఆధునిక వైద్యంలో మందులతో పాటు యాంజియోప్లాస్టీ వంటి అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సరైన సమయంలో స్పందించి ముందస్తు చికిత్స తీసుకుంటే అవయవాలను కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఏపీ మార్కెటింగ్ మేనేజర్ కే చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ బి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఇమ్యూనైజేషన్ డే ట్రైనింగ్ ప్రోగ్రాం







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 10)

గర్ల్స్ జెడ్పీ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ మార్కాపురం నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మానేష్ ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుజన జిల్లాలోని డాక్టర్స్ అందరికి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానేష్ మాట్లాడుతూ ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల వయసు వారికి రెండు పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుజన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1079 పల్స్‌పోలియో బూతులు ఉన్నాయని, 1,08,531 మంది అర్హులైన చిన్నారులు ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు అందేలా చూడాలని డాక్టర్లకు తెలియచేసి వారికి ఈ కార్యక్రమం పై శిక్షణ ఇచ్చారు. గురువారం సూపర్‌విజనరీ స్టాఫ్‌కు కూడా ఎన్ఐడీ గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో డీఎంవో, డీఎల్‌టీవో రాహుల్, డీపీఎంవో డాక్టర్ జగదీశ్, జిల్లా ఎపిడిమాలజిస్ట్ రోహిత్, డాక్టర్ యాగ్నిక్, జిల్లాలోని మెడికల్ ఆఫీసర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్' పై టీడీపీ కార్యాలయం నందు అవగాహన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 10)

ఒంగోలు నగరంలోని టీడీపీ కార్యాలయం నందు ఒంగోలు నగర కమిటీ సమావేశం, నియోజకవర్గంలోని క్లస్టర్1 (ఒంగోలు రూరల్ మండలం) 7, 8, 9, 10లోని మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ,యూనిట్ ఇన్‌చార్జిలతోపై సర్‌పై శిక్షణ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధివిధానాలు, బాధ్యతలు, అమలు ప్రక్రియపై సవివరంగా వివరించి అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, ఓటరు జాబితాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. సర్‌కు సంభందించి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో మరింత మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు టీడీపీ నాయకులు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర, మండల కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్లు, డివిజన్ పార్టీ పార్టీ అధ్యక్షులు, యూనిట్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పుల్లలచెరువులో విఓఏల పనితీరు పై డీఆర్‌డీఏ పీడీ శివనారాయణ సమీక్ష

– ఏపీఎల్పీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి – గైర్హాజరైన 13 మంది విఓఏలకు నోటీసులు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూన్ 10)

మార్కాపురం జిల్లా డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శివనారాయణ బుధవారం పుల్లలచెరువు వెలుగు కార్యాలయంలో విఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాజెక్టుల అమలు తీరుపై విఓఏల వారీగా సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎల్పీ 2026–27 సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సర్వేలో భాగంగా మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల నుంచి 10 మంది సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు, బయోమెట్రిక్ ఆధారిత రుణాలు కావాలా లేదా అనే అంశంపై సభ్యుల అభిప్రాయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే మినీ డెయిరీలు, డెయిరీ యూనిట్లు, కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, అరకు కాఫీ సాగు, టీ తోటలు, గేట్స్ ఆఫ్ లైవ్లీహుడ్, వెదురు బొంగుల పెంపకం తదితర జీవనోపాధి కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని, పరిష్కార మార్గాలపై సూచనలు చేశారు. మండలంలో మొత్తం 36 మంది విఓఏలు ఉండగా, సమావేశానికి కేవలం 23 మంది మాత్రమే హాజరుకావడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు. గైర్హాజరైన 13 మంది విఓఏలకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాముఖ్యత పై కూడా అవగాహన కల్పించారు. ప్రతి నెల డ్వాక్రా సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా, సంఘాలకు రుణాలు అందుతున్నాయా వంటి అంశాలపై సభ్యులు మొబైల్ ఫోన్ ద్వారా స్పందించాలని వివరించారు. ఈ సమాచారంతో సంఘాల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఎం దానం, ఏపీఎం వెంకటయ్య, సీసీలు ఎలీషా, శ్రీను, విఓఏలు పాల్గొన్నారు.





## అన్నప్రసన్న వేడుకలో ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య





(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, జూన్ 10)

మండలంలోని ప్రసిద్ధ నాగారప్పమ్మ ఆలయంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం చల్లారెడ్డిపాలెం తెలుగు దేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కీర్తి పూర్ణ కుమారుడి అన్నప్రసన్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారికి అన్నప్రసన్న నిర్వహించి ఆశీర్వదించారు. చిన్నారి ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాకతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాల పై నిరసన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 10)

పంట పోలాల మద్య రొయ్యల చెరువుల తవ్వకాలపై కడవకుదురు ప్రజలు కన్నెర్ర చేశారు. మండలంలోని కడవకుదురు గ్రామస్థులు సోమవారం పంట పొలాలు మధ్య గ్రామనికి సమీపంలో రొయ్యల చెరువులు తవ్వుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చెరువుల తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసారు.అక్రమ చెరువుల తవ్వకాలు నిలిపివేయాలని, గ్రామన్ని,పంటపొలాలను కాపాడాలని నినాదాలు చేసారు. పంట పొలాలు పక్కనే చెరువులు తవ్వితే వరి పంట సాగు చేసుకునేందుకు అవకాశం ఉండదని, భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని రెవెన్యూ, మత్స్య అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కడవకుదురు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాల పై మరింత అప్రమత్తంగా ఉండాలి




**ప్రతి ఓటూ కీలకమే**
**వలస ఓటర్ల పై ప్రత్యేక దృష్టి పెట్టండి**
**ఓటరు మ్యాపింగ్ విషయంలో దీూా లు శ్రద్ధ వహించాలి**
**అధికారులతో సమన్వయం ఎంతో అవసరం**
**స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి**
**టీడీపీ ముఖ్యనేతలకు ఎమ్మెల్యే ఇంటూరి కీలక సూచనలు**
**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై**
**పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే ఇంటూరి**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 10)**

ఓటరు మ్యాపింగ్ కు సంబంధించి బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి, ఓటరు జాబితా నుంచి అర్హుల ఓట్లు తొలగించకుండా శ్రద్ధ తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఎన్నికల సంఘం అమలు చేస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మండల, గ్రామ, వార్డు అధ్యక్షులకు అవగాహన కల్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పార్టీ ముఖ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి ఓటరు వివరాలను అధికారులు సేకరిస్తారని చెప్పారు. పూర్తి అడ్రస్, ఆధార్ నెంబరు, ఫోను నెంబరు, కొత్త ఫోటో మరికొన్ని వివరాలను ఓటర్లు రెండు ఫారాలలో పూర్తిచేసి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 24 సంవత్సరాల తరువాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం జరుగుతున్నందున, ఏ ఒక్కరి ఓటు తీసివేయకుండా జాగ్రత్తలు వహించాలని ఎమ్మెల్యే సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఓటర్ దగ్గర నుంచి సంబంధిత ఫారాలను పూర్తి చేయించి, బూత్ లెవెల్ అధికారికి అందించేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. ప్రతిరోజు కనీసం 50 ఫారాలను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాలకు వలసలు వెళ్లిన ఓటర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పార్టీ సానుభూతిపరుల ఓటు ఒక్కటి కూడా తొలగించకుండా చూసుకోవాలన్నారు. రివిజన్ కార్యక్రమం ప్రారంభానికి ముందు పార్టీ నేతలందరూ ఒకచోట కూర్చొని ఓటరు జాబితాలను ఒకసారి పరిశీలిస్తే అందులో తప్పులు తెలుస్తాయన్నారు. తద్వారా రివిజన్ కార్యక్రమంలో ఏం చేయాలన్న దాని పై అవగాహన వస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లతో పాటు క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, పార్టీ అధ్యక్షులు సమన్వయంతో ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కోరారు. రివిజన్ పూర్తయిన తర్వాత సెప్టెంబర్ నెలలో వచ్చే ఓటర్ జాబితాల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఏ విధంగా కష్టపడ్డారో, అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పనిచేసి తెలుగుదేశం పార్టీ సత్తా చాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరిగే నెల రోజులు పాటు, ప్రతిరోజు తాను అందరితో పర్యవేక్షిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గ పరిశీలకురాలు మట్టెం శ్రావణిరెడ్డి మాట్లాడుతూ కేవలం బిఎల్ఎలు మాత్రమే కాకుండా గ్రామాలలో పార్టీ ముఖ్య నేతలు అందరూ ఓటరు జాబితాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ అధిష్టానం కూడా దీని పై ప్రతిరోజూ రివ్యూ చేస్తుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో రివిజన్ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. కందుకూరులోని టిడిపి కార్యాలయంలో ఈ సమావేశం జరగగా ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ








## ఆక్రమణకు గురైన స్మశాన వాటిక ప్రాంతాన్ని పరిశీలించిన జనసేన నాయకులు





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 10)**

పొదిలి మండలం పోతారం గ్రామంలోని దళితుల స్మశాన వాటిక ఆక్రమణకు గురైన విషయాన్ని గ్రామానికి చెందిన దళిత సోదరులు జనసేన నాయకులు హల్చల్ జహీర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతను గుర్తించిన హల్చల్ జహీర్ వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన స్మశాన వాటిక ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హల్చల్ జహీర్ మాట్లాడుతూ దళితుల హక్కులను కాలరాసే విధంగా స్మశాన వాటిక భూములను ఆక్రమించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దళితులకు చెందిన స్మశాన వాటికను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఆక్రమణదారులపై తక్షణ చర్యలు తీసుకొని, స్మశాన వాటిక భూమిని దళితులకు తిరిగి అప్పగించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. పోతారం గ్రామ దళితులకు న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పోరాడతామని హల్చల్ జహీర్ తెలిపారు. "దళితుల హక్కులపై ఎలాంటి అన్యాయం జరిగినా సహించేది లేదు–న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు" అని పేర్కొన్నారు.

## యర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో మండల స్థాయిలో సర్ అవగాహన కార్యక్రమం






**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 10)**

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ద్వారా ఓటర్ల జాబితాలో అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా డిఎల్ఏలు బాధ్యత వహించాలని, అలాగే ప్రజలకు పార్టీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ 1 మంత్రు నాయక్, క్లస్టర్ ఇంచార్జ్ 2 షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), క్లస్టర్ ఇంచార్జ్ 3 సత్యనారాయణ గౌడ్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులు సమన్వంతో పనిచేయాలి

### ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ పై నాయకుల దిశ నిర్దేశం

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూన్ 10)**

ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం (యస్ఐఆర్)ను విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు కీలక పాత్ర పోషించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సూచనల మేరకు పుల్లలచెరువు మండల కేంద్రంలోని రైస్ మిల్లులో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు జాబితాల్లో ఉండేలా చూడటం, తప్పుల సవరణ వంటి అంశాల్లో పార్టీ శ్రేణులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ యస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల పార్టీ అధ్యక్షుడు పోట్ల గోవిందు, ఎంపీపీ కందుల వెంకటయ్య, పయ్యావుల ప్రసాద్ హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అలాగే మండల సీనియర్ నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి సెనగ వెంకటేశ్వర్ రెడ్డి, మేడికొండ లక్ష్మణ్, టౌన్ పార్టీ అధ్యక్షుడు మేడికొండ అనిల్, ఇదియమ్మ నాయుడు, ఉప్పల హనుమంతు, ఎంపీటీసీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. యస్ఐఆర్ కార్యక్రమం అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాయకులు సూచించారు.






## భారత ప్రధానిగా మోడీ రికార్డు దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీక

### బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 10)**



దేశంలో ఎన్నికైన ప్రధాన మంత్రుల్లో అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రధానిగా నరేంద్ర మోడీ బుధవారంనాడు సరికొత్త రికార్డు నెలకొల్పడం నవ భారత ఆవిష్కరణకు శుభ సూచకమని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 26, 2014న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోడీ, ప్రధానిగా విజయవంతంగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు దేశ ప్రధానులుగా చేసిన వారిలో మొదటి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజులు పదవిలో ఉండగా, తాజాగా మోడీ ఆ రికార్డును అధిగమించారని ఆమె గుర్తు చేశారు.

**ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడించిన దేశ ఖ్యాతి :**

గత పన్నెండేళ్లలో ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో పలు రంగాల్లో అనూహ్యమైన, సానుకూలమైన, ప్రజోపకరమైన మార్పులు సంభవించాయి. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా మన దేశ ఖ్యాతి ఇనుమడించింది అని సుప్రజ కొనియాడారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు కొన్నేళ్లుగా దేశంలోఌ నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితుల వల్ల నైరాశ్యానికి గురై, సమర్థవంతమైన నాయకుని కోసం ఉవ్విళ్లూరిన ప్రజలు నరేంద్ర మోడీని స్పష్టమైన మెజారిటీతో ప్రధానిగా ఎన్నుకున్నారని ఆమె గుర్తు చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు వారు తనపట్ల ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, సమర్థ నాయకత్వం, సుపరిపాలన, సంస్కరణలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పటిష్ట అమలు ద్వారా మోడీ వరుసగా దేశ ప్రధానిగా ఎన్నికవడం విశేషమని నారిశెట్టి సుప్రజ పేర్కొన్నారు.



## మున్నం నాగేశ్వరరెడ్డి మృతికి గాదే సంతాపం

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 10)**

చిన్నగంజాం మండల వైసీపీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అకాల మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి గాదే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నం నాగేశ్వరరెడ్డి ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com